
ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

గురువారం 17 ఏప్రిల్ 2025 www.prajaaswaramdaily.com 2 pm

# ఈతకు వెళ్లి ఇద్దరు మృతి





ఖమ్మం : ఖమ్మంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు మృతి చెందారు. ఖమ్మం పంపింగ్ వెల్ ప్రాంతానికి చెందిన కూచిపూడి బెన్విత్, అన్నం కిరణ్ తేజాలు ఇటీవల పది పరీక్షలు రాశారు. ఉదయం ఇద్దరు స్నేహితులు క్రికెట్ ఆడేందుకు అంటూ బయటకు వెళ్లారు. అనంతరం దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ వద్ద ఈతకు వెళ్లారు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయారు. ఒడ్డున దుస్తులు గుర్తించి..గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసులు మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుర మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు

# కాంగ్రెస్ నేతల ధర్నా



## నేషనల్ హెరాల్డ్ కేసు..
## సోనియా, రాహుల్ పేర్లు చేర్చడాన్నినిరసిస్తూ..

హైదరాబాద్: నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను ఛార్జ్‌షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఏఐసీసీ పిలుపు మేరకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు.


టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఈడీ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



# రోల్‌మోడల్‌గా 'భూ భారతి'

## ధరణి లోపాలను సరిదిద్దాలని బీఆర్ఎస్ వాళ్లే కోరుతున్నారు
## వారి భూమే నమోదు కాలేదట
## మంత్రి పొంగులేటి

మద్దూరు: ధరణిలో తమ భూమి నమోదు కాలేదని బీఆర్ ఎస్ నేతలే చెబుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం ఖాజీపూర్‌లో 'భూభారతి'పై ఏర్పాటు చేసి రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ''ధరణి లోపాలను సరి దిద్దాలని మాజీ మంత్రులు కోరుతున్నారు. వివరాలు తప్పుగా నమోదయ్యాయని చెబుతున్నారు. భూభారతి బిల్లు అసెంబ్లీలో పెడితే మాత్రం అడ్డుకునే ప్రయత్నం చేశారు. పేదలకు అండగా ఉండేందుకు ఈ చట్టం తీసుకువచ్చాం. భూ భారతి చట్టం దేశంలోనే రోల్‌మోడల్ కాబోతోంది. ధరణి అమలులో ఉన్నప్పుడు అధికారుల వద్దకే ప్రజలు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అధికారులే ప్రజల వద్దకు వస్తున్నారు. ఒక్క రూపాయి లేకుండా దరఖాస్తు చేసే అవకాశం వచ్చింది. పేదలకు చెందిన వేల ఎకరాలను గత ప్రభుత్వం కొల్లగొట్టింది. గతంలో కొల్లగొట్టిన భూములపై ఆడిట్ చేసి పేదలకు పంచుతాం. అసైన్డ్ భూముల్లో సాగు చేసుకుంటున్న అర్హులైన పేదలకు ఇస్తాం. కోర్టులో లేని భూముల సమస్యలను భూభారతి ద్వారా పరిష్కరిస్తాం. గతంలో పాసు పుస్తకం ప్రకారం కాకుండా భూమి ఎక్కువో.. తక్కువో ఉండేది'' అని పొంగులేటి అన్నారు.



# మెట్రో ప్రయాణికులపై భారం?

## త్వరలో పెరగనున్న చార్జీలు

**హైదరాబాద్ : మెట్రో రైలు సేవలు దేశంలోనే అతి పెద్ద పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) ప్రాజెక్టుగా నిలిచింది. తాజాగా హైదరాబాద్ మెట్రోను నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ సంస్థ రూ.6,500 కోట్లకు పైగా నష్టాలను ప్రకటించింది. ఈ నేపథ్యంలో భాగంగా మెట్రో రైల్ ఛార్జీల పెంపు తప్పదన్న ఊహాగానాలు గట్టిగా వినిపిస్తున్నాయి.**

దీనికి కారణం ఇప్పటికే ప్రయాణికులకు అందిస్తున్న కొన్ని డిస్కౌంట్ల విధానాలను తొలగించడం కూడా దీనికి సంకేతంగా భావిస్తున్నారు. కోవిడ్–19 ప్రభావంతో తీవ్ర ఆర్థిక నష్టాలు వాటిల్లగా.. అప్పటి ప్రభుత్వం మెట్రో చార్జీల పెంపునకు కేంద్రాన్ని కోరింది. అందుకు 'మెట్రో రైల్వే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ – 2002' ఓ కమిటీ ప్రయాణికుల అభిప్రాయాలు, ఎల్ అండ్ టీ ప్రతిపాదనలు పరిశీలించి చార్జీల పెంపును ఆమోదించింది. అయితే నాటి ప్రభుత్వం ఆ పెంపును ఆమోదించలేదు. ఇప్పుడు ఎల్ అండ్ టీ సంస్థ రద్దీ సమయాల్లో ఇచ్చే 10 శాతం డిస్కౌంట్‌ను తొలగించింది. అలాగే, రూ.59 విలువైన హాలిడే సేవర్ కార్డు సేవను కూడా నిలిపివేసింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మెట్రోలో కనిష్ఠ ఛార్జీ రూ.10, గరిష్ఠ ఛార్జీ రూ.60 ఉండగా., దీనిపై ఎంతవరకు పెరగొచ్చనే స్పష్టత ఇంకా లేదు. త్వరలో హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణం కాస్త భారం కాబోతున్నట్లు అర్థమవుతుంది.



# రెండవ రోజుకు ఈడీ సోదాలు

## కోట్లలో నగదు పట్టివేత!

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో రెండవ రోజు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు కొనసాగుతున్నాయి. సురానా ఇండస్ట్రీస్ ఎండీ నరేంద్ర సురానా నివాసంలో పెద్దఎత్తున నగదు స్వాధీనం కావడం కలకలం రేపుతోంది. ఈడీ ప్రాథమిక విచారణలో నరేంద్ర సురానా పలు షెల్ కంపెనీలు ఏర్పాటు చేసి, బ్యాంకుల నుంచి పొందిన రుణాలను వీటి ద్వారా అక్రమ లావాదేవీలకు ఉపయోగించినట్లు గుర్తించారు. ఈ సోదాల్లో మరో కీలక సంఘటన సాయి సూర్య డెవలపర్స్‌కు చెందిన సతీష్ ఇంట్లో భారీగా నగదు స్వాధీనం కావడం. అలాగే సాయి సూర్య సంస్థల కార్యాలయాల్లోనూ కోట్లల్లో నగదు పట్టుబడింది. గతంలోనే సైబరాబాద్ పోలీసులు సతీష్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వట్టి నాగులపల్లి ప్రాంతంలో "వెంచర్" పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును దృష్టిలో ఉంచుకుని ఈడీ అధికారులు సాయి సూర్య డెవలపర్స్‌పై విచారణ చేపట్టారు. ఇప్పటికే సంస్థకు చెందిన పలు బ్యాంకు లావాదేవీలు, ప్రాపర్టీల వివరాలను సేకరిస్తున్నారు. మొత్తం మీద ఈడీ దాడులతో నగర వ్యాప్తంగా ఆర్థిక నేరాలపై ఉక్కుపాదం వేసే దిశగా చర్యలు సాగుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఈడీ సోదాల్లో నగదు, షెల్ కంపెనీల వ్యవహారాలు వెలుగులోకి రావడం ఇప్పటికే ఉన్న పోలీసు కేసులతో ముడిపడడం వల్ల ఈ దర్యాప్తు మరింత ఉత్కంఠకు గురిచేస్తోంది.

## రాహుల్ గాంధీ
# అమెరికా పర్యటన ఖరారు

ఢిల్లీ : అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. ఆయన ఈనెల 21 నుంచి 22 వరకు అగ్రరాజ్యంలో పర్యటించనున్నారు. ఆ పార్టీ నేత పవన్ ఖేడా గురువారం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఏప్రిల్ 21, 22 తేదీల్లో రాహుల్‌గాంధీ యూఎస్ లో పర్యటిస్తారని ఖేడా తెలిపారు. రోడ్ ఐలాండ్‌లోని బ్రౌన్ యూనివర్సిటీని సందర్శిస్తారన్నారు. ఆ వర్సిటీలోని విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడతారని తెలిపారు. దీనికి ముందు ఆయన ఎన్నారై సంఘ సభ్యులతో పాటు ఇండియా ఓవర్సీస్ కాంగ్రెస్ (ఐఓసీ) సభ్యులతోను సమావేశమవుతారని వెల్లడించారు.



# ఆధారాలు అందజేస్తాం

## నెలాఖరులో కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ఇస్తాం..

## అప్పటికీ స్పందించకుంటే ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం
## రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని బీజేపీ కాపాడుతోంది
## ప్రభుత్వాన్ని కూలగొట్టాల్సిన ఖర్మ మాకు లేదు
## రేవంత్‌రెడ్డి సైన్యంలా కొందరు పోలీసులు
## ఇష్టానుసారం కేసులు పెడితే సుప్రీంకు వెళతాం : కేటీఆర్



హైదరాబాద్: ప్రభుత్వాన్ని కూలగొట్టాల్సిన ఖర్మ తమకు లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ''బంగ్లా తరహాలో జనమే రోడ్లపైకి వచ్చి ప్రభుత్వాన్ని పడగొడతారు. ఎంతో మంది నియంతలకు ప్రజలకు గుణపాఠం చెప్పారు. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు సీఎంగా ఉండాలని కోరుకుంటున్నా. మళ్లీ 20 ఏళ్ల వరకు ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరు. ప్రజలకు కూడా అన్ని విషయాలు అర్థం కావాలి. సీఎం ఆర్థిక దోపిడీ, పర్యావరణ విధ్వంసంపై సిట్టింగ్ జడ్జి లేదా స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేయాలి. మరొకరు సీఎం స్థానంలో ఉంటే కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో రాజీనామా చేసేవారు. రేవంత్‌రెడ్డికి ధైర్యం ఉంటే భద్రత లేకుండా జనంలోకి వెళ్లాలి.

మాటల వేట సీఎందే కానీ.. సీఎస్, అధికారులు బలవుతున్నారు. ఐఏఎస్, అటవీ అధికారుల వంతైంది.. ఇతర అధికారులూ జాగ్రత్తగా ఉండాలి. రేవంత్‌రెడ్డి సైన్యంలా కొందరు పోలీసులు వ్యవహరిస్తున్నారు. ఇష్టానుసారం కేసులు పెట్టిన వారిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం. రేవంత్‌రెడ్డి ప్రైవేటు ముఠాలా పని చేస్తున్న పోలీసులు ఊచలు లెక్కించాల్సి వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు ఎండగట్టింది.

బీజేపీకి చిత్తశుద్ధి ఉందా? లేదా? అనే దానిపై నెలాఖరు వరకు ఎదురుచూస్తాం. నెలాఖరులో బీఆర్ఎస్ భేటీ తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థల వద్దకు వెళ్తాం. ఆధారాలతో సహా వాటికి అందజేస్తాం. అప్పటికీ స్పందించకపోతే ప్రజాక్షేత్రంలో బీజేపీని ఎండగడతాం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని బీజేపీ కాపాడుతోందని చెప్పాల్సి వస్తుంది. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఆర్థిక దోపిడీ, పర్యావరణంపై దాడి విషయంపై ప్రధాని స్పందించాలి. స్పందించకపోతే ఆయనకు కూడా పాపంలో వాటా ఉందని భావించాల్సి వస్తుంది. చిత్తశుద్ధి ఉంటే రేవంత్‌రెడ్డి బయటకు రావాలి. ఫార్ములా ఈ రేసులో మంత్రిగా విధాన నిర్ణయాలు తీసుకున్నా అని చెప్పా.. అంతేకానీ అధికారులను బలి చేయలేదు. ఫార్ములా ఈ రేసులో అభ్యంతరం ఉంటే నేను బాధ్యత తీసుకుంటా'' అని కేటీఆర్ తెలిపారు.